కాంగ్రెస్ పాలనతోనే దళితులకు మేలు

• పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పాలనలోనే దళితులకు సముచిత న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి లక్ష్మణ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో అంబేద్కర్ భవన్ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, నాయకులు బాపయ్య, సదయ్య, మధు , రాజేశ్, శ్యాం, మల్లేశ్, సదానందం, రంగన్న, రమేశ్‌బాబు ఉన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

పెద్దపల్లిరూరల్: ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు స్నేహపూర్వకంగా మెదలాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో సంక్రాంతి పండుగ సందర్భంగా చత్రపతి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతి ఆదివారం అందజేశారు.

ఎల్‌వోసీ అందజేత

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన కె.జశ్వితకు రూ.1,25,000 ఎల్‌వోసీ పత్రాన్ని మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కొమురయ్యకు రూ.60వేల విలువ గల ఎల్‌వోసీని వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఆదివారం ఎలిగేడు మండలం శివపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, అశోక్ రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. అమృత్–2 స్కీంలో రూ.250కోట్ల అభివృద్ధి పనుల పురోగతిపై ఏడీఎంఏ జాన్ శ్యాంసన్‌తో చర్చించారు. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు వెంటనే మంజూరు చేయాలని ఆయనను కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ఫాగింగ్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. ఆదివారం పలు కాలనీల్లో మున్సిపల్ సిబ్బందితో ఆటో ట్రాలీ ద్వారా ఫాగింగ్ యంత్రంతో పిచికారీ చేయించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



అభినందిస్తున్న కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు 14, 17 ఏళ్ల బాలుర విభాగంలో శివప్రసాద్ సిల్వర్ మెడల్, ఎం సంప్రీత్ బ్రాంజ్ మెడల్ సాధించారు. జిల్లాలోని ఎన్టీపీసీలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ పోటీలు నిర్వహించారు. ఆదివారం ఐపీఎస్ పాఠశాలలో బహుమతి పొందిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్‌కుమార్ ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి చూపాలని పతకాలు సాధించడం అభినందనీయమని, క్రీడలను ప్రోత్సహించడంలో స్కూల్ ముందుంటుందన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



రామగుండం: కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధిలోని అబాది రామగుండం నుంచి లింగాపూర్ గ్రామం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి రోడ్డుకు పైకి అడ్డుగా ఉన్నాయి. దీంతో వాహనదారులకు ముళ్లపొదలు తగులుతున్నాయి. ఈ విషయమై పలువురు పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె ఆదివారం తన సొంత ఖర్చులతో జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించారు.

అయోధ్య శ్రీరాముని ధ్వజాల పంపిణీ



శ్రీరామ ధ్వజం అందజేస్తున్న రామ స్వరూప

జ్యోతినగర్: జై శ్రీరాం జై శ్రీరాం అంటూ హిందూ భక్తులు అయోధ్య శ్రీరాముడిని స్మరిస్తున్నారు. ఆదివారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో శ్రీరాముడి భక్తురాలు రామ స్వరూప అయోధ్య రాముడి ధ్వజాలను ఇంటింటా అందించింది. స్వరూప తన పేరులో రామ అని చేర్చుకుని రామ స్వరూపగా మార్చుకుని రాముని సేవలో తరిస్తున్నారు. సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జైశ్రీరాం ధ్వజాన్ని ఎగురవేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో ఐదు దీపాలను వెలిగించి పూజలు చేసి రామ భక్తిని చాటాలని పిలుపునిచ్చారు.

మోటార్ వెహికల్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి మోటార్ వెహికల్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని మోటార్ వెహికల్ డ్రైవర్స్ తరపున వినతిపత్రం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థకు అవసరం ఉన్నచోట నూతన వాహనాలు కొనుగోలు చేయాలని, కోల్ ట్రాన్స్‌పోర్ట్ కోసం సరిపడా వాహనాలు కంపెనీ పరంగా కొనుగోలు చేయాలన్నారు. సంస్థవ్యాప్తంగా ఉన్న మోటార్ వెహికల్ డ్రైవర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఇప్పటి వరకు ఉన్న డ్రెస్‌కోడ్‌ను మార్చాలన్నారు. మోటార్ వెహికల్ డ్రైవర్లను మోటార్ వెహికల్ ఆపరేటర్లుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. మంద రమాకాంత్, పల్లె శ్రీనివాస్, బోడకుంట రాజేశం, తుమ్మ గట్టయ్య, కల్రావుల మహేశ్ పాల్గొన్నారు.

హైటెన్షన్ కరెంట్ వైర్ల పరిశీలన



టవర్లు పరిశీలిస్తున్న ప్రతినిధులు

జ్యోతినగర్: రామగుండం ఎరువుల కర్మాగారానికి విద్యుత్ సరఫరా చేసే హైటెన్షన్ టవర్లు, విద్యుత్ తీగలను డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ బుల్లిబాబుల బృందం ఆదివారం పరిశీలించింది. ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు నుంచి కర్మాగారం వెళ్లే ప్రధాన హైటెన్షన్ టవర్లను పరిశీలించారు. వీటి ద్వారా విద్యుత్ సరఫరా కొన్నేళ్లక్రితమే నిలిచిపోయింది. స్థానికులు కొందరు నివాసాలు నిర్మించుకున్నారని, ప్రజాసంక్షేమం కోసం విద్యుత్ సరఫరాలేని 39 టవర్లను పరిశీలించి తొలగించాలని పలువురు ప్రతినిధులు కోరారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న జానపద కళాకారులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దంపేటలో ఆదివారం జానపద కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. బాల్య వివాహాలు చేయొద్దని, ప్రోత్సహించొద్దని, గుట్కాలు తింటే ఆరోగ్యానికి హానికరమని, గంజాయి, మాదకద్రవ్యాల వ్యసనాల మత్తులో యువత భవిష్యత్ నాశనమవుతుందని అవగాహన కల్పించారు. ఆరు గ్యారంటీల ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కళా ప్రదర్శన ద్వారా ప్రజలకు వివరించారు. సర్పంచ్ ఓదెల రవి, ఉపర్పంచు రాజేందర్, జానపద కళాకారులు కోంద్ర వెంకన్న, ఈదునూరి పద్మ, కన్నూరి రేణుక, సీను, శ్రీవల్లి, మల్లేశ్, రమ, సలేంద్ర, సాయిలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు



టాస్ వేస్తున్న జడ్జి గణేశ్

గోదావరిఖనిటౌన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సింగరేణి స్టేడియం గ్రౌండ్‌లో న్యాయవాదులకు క్రికెట్ పోటీలను ఆదివారం గోదావరిఖని మొదటి అదనపు జడ్జి దుర్గం గణేశ్ టాస్ వేసి ప్రారంభించారు. ఎ, బి క్రికెట్ జట్లుగా విభజించగా ఎ జట్టుకు కెప్టెన్‌గా రంగు శ్రీనివాస్, బి.జట్టుకు కెప్టెన్‌గా ఎ.ప్రదీప్‌కుమార్ వ్యవహరించారు. ఈ మ్యాచ్‌లో ఎ జట్టుకు చెందిన రంగు శ్రీనివాస్ జట్టు విజయం సాధించింది. బూస లక్ష్మయ్య ట్రస్ట్ అధ్యక్షుడు భూస ప్రదీప్‌కుమార్, నాగేందర్, శ్రావణి, రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు భోజనం ఏర్పాటు చేశారు. న్యాయవాదులు మురళీధర్‌యాదవ్, గజ్జెల్లి వెంకటేశ్వర్లు పండ్లు, శీతల పానీయాలు ఆటగాళ్లకు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, ప్రధాన కార్యదర్శి బోడ సమ్మయ్య, క్రీడా కార్యదర్శి రంగు శ్రీనివాస్, కోశాధికారి ఉమర్, గోసిక ప్రకాశ్, ప్రదీప్‌కుమార్, పెట్టెం వెంకటేశ్వర్లు, సీహెచ్.శైలజ, పూర్మ శ్రీనివాస్, కిషన్‌రావు, ఎస్.చంద్రశేఖర్, దాదా సలాం, వరలక్ష్మి, ప్రసన్న పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ పూజారి శ్రీకమ్మల చంద్రశేఖర్‌శర్మ ఆదివారం నేరుగా ప్రముఖుల వద్దకు వెళ్లి అయోధ్య అక్షింతలు అందజేశారు. ఇందులో భాగంగా మాజీ జెడ్పీటీసీ, ఎమ్మెల్యే సమీప బంధువు హేమలతాఠాకూర్, రామగుండం ఎస్సై బోయ వెంకటస్వామి, కార్పొరేటర్ కౌశిక లత స్వగృహాలకు వెళ్లి అందజేశారు.

జాతి సమైక్యతలో భాగస్వాములవుదాం



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: జాతి సమైక్యత, సమగ్రతలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులందరూ భాగస్వాములవ్వాలని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని మసీద్‌లో నియోజకవర్గంలోని మసీద్ కమిటీల ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా బాబర్ సలీంపాషా, కార్యదర్శిగా రియాజ్ అహ్మద్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో అయాజ్, షరీఫ్, అబ్దుల్ సమద్, షేక్ అలీ, రియాజ్ బేగ్, సర్వర్, అక్తర్, హఫీజ్, రఫీక్, సలీం బేగ్, ఉమర్, అహ్మద్ బాబా, సలీం, మెరాజ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సదరం క్యాంపు వినియోగించుకోవాలి

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించే సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు శంకర్, మొండయ్య, తిరుపతి, సతీశ్, కొమురయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. గర్రెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ముత్తారంలో..

ముత్తారం: ముత్తారం పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించనున్న సదరం క్యాంపును దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో దివ్యాంగులకు సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు బాలాజీ పేర్కొన్నారు.

ఎలిగేడులో..

ఎలిగేడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 22న ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని కలిసిన కాంగ్రెస్ నేత

సుల్తానాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేశ్ కుమార్‌గౌడ్‌ను యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఉట్ల వరప్రసాద్ కలిశారు. ఆదివారం హైదరాబాద్ ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

సమ్మక్క జాతర పాలకవర్గం ఎన్నికకు కసరత్తు

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణకు పాలకవర్గం ఎన్నిక కోసం గ్రామంలోని కుల సంఘాలతో సమావేశం జరిగిందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలోని హైస్కూల్ ఆవరణలో కొలనూర్ గ్రామంలో ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క–సారలమ్మ జాతర చైర్మన్, పాలకవర్గం సభ్యుల కోసం పేర్లను సేకరించి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. జాతర ఏర్పాట్లు, చైర్మన్, సభ్యుల ఎంపిక త్వరలో ఎమ్మెల్యే సమక్షంలో జరుగుతుందని ఆయన చెప్పారు.

చేతి వృత్తులకు కేంద్ర ప్రభుత్వం ఆదరణ

జూలపల్లి: దేశంలో చేతి వృత్తులను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్ అన్నారు. మండల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జూలపల్లి గ్రామ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ మేరకు వికసిత భారత్ క్యాలెండర్‌ను సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు సంతోష్‌రెడ్డి, మేరుగు రమేశ్, బాలెంగల హన్మయ్య, దీకొండ ఆంజనేయులు, రమేశ్, కొండ రవి, సంబారి ఆంజనేయులు, సత్యం, చిప్ప శంకరయ్య, అందె దశరథం ఉన్నారు.

ఆలయంలో స్వయంసేవ

జూలపల్లి: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుభ్రం చేశారు. మహేశ్ మాట్లాడుతూ దేశ ప్రజల చిరకాల కోరిక నెరవేరడంతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించినట్లు చెప్పారు. నాయకులు సంతోష్ రెడ్డి, పూజారి నిరంజన్, గుమ్మడి శంకర్ ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురంలో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వికాసి భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం ప్రచార రథంలోని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు వివరించారు.

ఆలయం పరిశుభ్రం

రామగుండం: అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో పారిశుధ్య నిర్వహణ పనుల్లో స్థానిక కార్పొరేటర్ కౌశిక లత నిమగ్నమయ్యారు. కాగా ఆలయాన్ని శుద్ధి చేసి ప్రాంగణంలో ఉన్న పూలకుండీల్లో పిచ్చి మొక్కలను తొలగించి మరిన్ని మొక్కలు నాటారు.

స్వచ్ఛందంగా మాంసం విక్రయాలు బంద్



ప్రకటన విడుదల చేస్తున్న సంఘం నాయకులు

గోదావరిఖనిటౌన్: అయోధ్య శ్రీరామ మందిరంలో సోమవారం బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా జంతువధను స్వచ్ఛందంగా నిషేధించి మాంసం విక్రయించబోమని రామగుండం ఆరె కటిక సంఘం అధ్యక్షుడు గౌళికార్ రాము, ప్రధాన కార్యదర్శి నర్సోజి తెలిపారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో మటన్, చికెన్ షాపులు పూర్తిగా బంద్ ఉంటాయని పేర్కొన్నారు.

ఆలయాల శుభ్రం

సుల్తానాబాద్‌రూరల్: అయోధ్య రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని మండలంలోని కందునూరిపల్లె, చిన్నకల్వల, గర్రెపల్లిలోని ఆలయాలను ఆదివారం బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. నాయకులు నాగరాజు, శంకరయ్య, సదయ్య, సతీశ్ గౌడ్, ఈశ్వర్, మనోహర్, అఖిల్ పాల్గొన్నారు.

బాపు చిత్రకళా పురస్కారం స్వీకరణ



పురస్కారం అందుకుంటున్న రమణయ్య

జూలపల్లి: పెద్దాపూర్ గ్రామానికి చెందిన చిత్రకారుడు, కవి, రచయిత గుండు రమణయ్య శనివారం రాత్రి బాపు చిత్రకళా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ప్రముఖ చలనచిత్ర నటుడు, రచయిత తణికెళ్ల భరణి తదితరుల నుంచి ఆయన అవార్డు స్వీకరించారు. ఏపీ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయ్‌బాబు, కూచిపూడి నాట్య గురువు ఎస్పీ భారతి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ డైరెక్టర్ టి.సుభాషిణి, వెంకటేశ్వర్‌రావు, స్వప్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి



పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

గోదావరిఖని: నిర్దేశిత బొగ్గు, మట్టి వెలికితీత లక్ష్యాలను భద్రతతో సాధించుకోవాలని ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఓసీపీ–3 వ్యూపాయింట్ ద్వారా పనిస్థలాలు పరిశీలించి క్వారీ లోపలికి దిగారు. ఆర్‌వీఆర్ కంపెనీ చేపట్టిన ఓబీ తొలగింపు పనులు పరిశీలించారు. ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ ఏరియాలో ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు తీసుకుంటున్న చర్యలను, చేపడుతున్న ప్రణాళికల గురించి వివరించారు. డైరెక్టర్ మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం ఉత్పత్తి చేయాలన్నారు. ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, సర్వే అధికారి నర్సింగరావు, అఫీషియేటింగ్ సీనియర్ సెక్యూరిటీ అధికారి వెంకటమోహన్ పాల్గొన్నారు.

మార్క్సిజమే ప్రజలకు ఆయుధం



మాట్లాడుతున్న శ్రీనివాస్

జ్యోతినగర్: ప్రపంచ ప్రజలకు మార్క్సిజమే ఆయుధమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ ఆటోనగర్ యూనియన్ కార్యాలయంలో లెనిన్ మహోపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో అమలు చేయడం గురించి శాస్త్రీయ సిద్ధాంతం బోధించిన మహనీయుడు లెనిన్ అన్నారు. 'మా సిద్ధాంతం పిడివాదం కాదు–అది ఆచరణకు కరదీపిక' అని మార్క్స్– ఏంగెల్స్ సిద్ధాంతానికి, ఆచరణకూ మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని ఆచరణలో చూపించడం ద్వారా అక్టోబర్ విప్లవం సాధించిన ప్రథమ వ్యక్తి లెనిన్ అని వెల్లడించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం రామ మందిర నిర్మాణం పేరిట భారతదేశ ప్రజలను మతోన్మాదం మత్తులో ముంచేందుకు ముందుకు సాగుతోందని విమర్శించారు. నానాటికి అంతరాలను పెంచుతూ ప్రజలు అభివృద్ధి చెందకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. భారతదేశానికి కావాల్సింది గుడులు కాదు, దేవుని పేరిట రాజకీయాలు కాదు, ప్రజలకు కావాల్సింది శాస్త్రీయ దృక్పథం అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్, ఆడెపు శంకర్, మార్త రాములు, లక్ష్మి, చంద్రయ్య, వైకుంఠం, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

లెనిన్ శత వర్ధంతి సభ

గోదావరిఖని: లెనిన్ శత వర్ధంతి సభను ఆదివారం స్థానిక ఐఎఫ్‌టీయూ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జేవీ చలపతిరావు, నాయకులు నరేశ్, రాజన్న, కృష్ణ, వెంకన్న, అశోక్ పాల్గొన్నారు.

కోలాహలంగా ఆటో యూనియన్ ఎన్నికలు



రహీంకు అభినందనలు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ అడ్డా ఆటో డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్(608/19) ఎన్నికలు కోలాహలంగా జరిగాయి. అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత అధ్యక్షుడు ఎండీ.రహీం, మరో వ్యక్తి మూడ్ శేఖర్‌నాయక్ ఇరువురు బరిలో ఉండగా 30ఓట్ల మెజార్టీతో రహీం రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రహీం మాట్లాడుతూ తనను గెలిపించిన తోటి ఆటో డ్రైవర్లు, ఓనర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ డ్రైవర్ల అందరి సంక్షేమానికి పాటుపడతానని హామీ ఇచ్చారు. అనంతరం రైల్వే సంబంధాల మాజీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ నూతన అధ్యక్షుడిని సన్మానించారు.

ఫిలిం మేకింగ్ శిక్షణలో 'ఖని' యూట్యూబర్స్



ప్రశంస పత్రం అందుకుంటున్న మ్యాజిక్ రాజా

కోల్‌సిటీ: మంచిర్యాలలో జరిగిన ఫిలిమ్ మేకింగ్ శిక్షణా శిబిరానికి గోదావరిఖనికి చెందిన యూట్యూబర్స్ హాజరై ప్రముఖ సినీ దర్శకుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సినీ, టీవీ, దర్శకులు, రచయితల శిక్షణ శిబిరంలో స్థానిక యూట్యూబర్స్ మేజిక్ రాజా, దామెర శంకర్, గొట్టె మహేశ్ పాల్గొన్నారు. రాష్ట్ర తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ శిబిరంలో ప్రముఖ సినీ దర్శకులు వీఎన్ ఆదిత్య, ప్రేమ్‌రాజ్, ప్రవీణ్ చందర్, ప్రముఖ స్క్రీన్ ప్లే, సినీ రచయిత శ్రీశైల మూర్తి, మానస్ శిక్షకులుగా వ్యవహరించారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పార్థసారథి, కలెక్టర్ బదావత్ సంతోష్, విజయ్‌కుమార్ ప్రశంస పత్రాలు అందించారు.

ఎలనంపుడు, బొడ్రాయి కార్యక్రమాలపై తేలిన లెక్కలు

ధర్మారం: మండల కేంద్రంలో విరాళాలతో ఏర్పాటు చేసిన ఎలనంపుడు, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన లెక్కలు ఎట్టకేలకు తేలిపోయాయి. ధర్మారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం గ్రామ ప్రజలు, స్థానిక నాయకుల వ్యాపారుల సమక్షంలో ఎలనంపుడు, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కేటాయించిన ఖర్చుల వివరాలపై సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు సమావేశం నిర్వహించారు. ఆరునెలల క్రితం ధర్మారంలో నిర్వహించిన ఎలనంపుడు, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం ప్రజల విరాళాలతో నిర్వహించారు. కులసంఘాలు, ఇతరులు ఇచ్చిన విరాళాలతో కలుపుకుని రూ.14,46,919 జమచేశారు. అయితే ఎలనంపుడు కార్యక్రమానికి రూ.8,34,168 ఖర్చు కాగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఖర్చులు రూ.5,92,680 అయినట్లు సర్పంచు వెల్లడించారు. మరో రూ.20,071 నిల్వ ఉన్నట్లుగా పేర్కొన్నారు.

ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్



జూలపల్లి: దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌వోలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో ఆదివారం ఓటరు నమోదు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు.

జూలపల్లి: మండలవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం ముగిసింది. మండలంలో ఏర్పాటు చేసిన 24 ప్రత్యేక నమోదు కేంద్రాల ద్వారా బీఎల్‌వోలు దరఖాస్తులు స్వీకరించారు. జూలపల్లిలోని నాలుగు నమోదు కేంద్రాలను ఆర్ఐ సదయ్య పరిశీలించి, తగిన సూచనలు చేశారు.

కమాన్‌పూర్: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నూతన ఓటరు నమోదు, తొలగింపు, మార్పు చేర్పుల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. బూత్ లెవల్ అధికారులకు వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నట్లు తహసీల్దార్ మోహన్ రెడ్డి తెలిపారు.

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో బూత్‌ల వద్ద ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదుకు స్పందన లభించింది. నూతన ఓటరుగా 45మంది దరఖాస్తులు చేసుకోగా యువత నుంచి దరఖాస్తులను బీఎల్‌వోలు స్వీకరించారు. తహసీల్దార్ స్వర్ణ, ఆర్ఐలు శైలజ, రజిత పాల్గొన్నారు.

సుల్తానాబాద్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని బీఎల్‌వోల ద్వారా నిర్వహించారు. నూతనంగా 141 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.